క్లుప్తంగా

మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



రైతులతో కలిసి మాట్లాడుతున్న కేకే

గంభీరావుపేట: మండలంలోని భీమునిమల్లారెడ్డిపేట గ్రామశివారులో మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మానేరు వాగు ఉధృతిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాగు అవతల సుమారు 600 ఎకరాలు పొలాలు ఉన్నాయని, వర్షాకాలంలో రైతులు వాగు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. గతేడాది ఓ రైతు వాగు దాటుతుండగా వరదలో కొట్టుకుపోయి మృతి చెందినా ప్రజాప్రతినిధుల్లో, అధికారుల్లో చలనం లేదన్నారు. రైతుల సౌకర్యార్థం వెంటనే బ్రిడ్జి మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వాగు అవతల చిక్కుకుపోయిన రైతులను వెంటనే కాపాడే ప్రయత్నాలు చేయాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. మండల శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఉన్నారు.

తెరుచుకున్న దర్గా



దర్గా వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో దర్గా ఎట్టకేలకు సయోధ్య కుదరడంతో శుక్రవారం తిరిగి తెరిచారు. ముస్లింల దర్గా ఇరువర్గాల మధ్య పొత్తుల వ్యవహారంతో గురువారం తాళం వేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి విచారణ చేపట్టి ఇరువర్గాల మధ్య సయోధ కుదుర్చారు. దీంతో భక్తులు, ముస్లింలు దర్గాను సందర్శించారు.

వృద్ధులకు ప్రయాణాల్లో రాయితీ కల్పించండి



పోస్టుకార్డుల ఉద్యమంలో వయోవృద్ధులు

సిరిసిల్లకల్చరల్: బస్సులు, రైళ్లలో వయోవృద్ధులకు ప్రయాణాల్లో 50 శాతం రాయితీలు కల్పించాలని ఆల్ సీనియర్ సిటీజన్ల సంఘం జిల్లా శాఖ శుక్రవారం ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య సారథ్యంలో హెడ్‌పోస్టాఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ప్రధాని, ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు వేశారు. సంఘం బాధ్యులు డాక్టర్ జనపాల శంకరయ్య, దొంత దేవదాస్, శ్రీగాధ మైసయ్య, గౌరిశెట్టి ఆనందం, అంకారపు జ్ఞానోభ, తడుక శ్రీహరి, గుర్రం భూంరెడ్డి, వేముల బక్కయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, కోడం శంకర్ పాల్గొన్నారు.

వంతెనలు లేక చింత

- వర్షం పడితే రాకపోకలు బంద్
- వంతెనల నిర్మాణం కోసం ప్రయాణికుల ఎదురుచూపు
- ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజలు



ఈ రెండు వాగులు వర్షాకాలంలో ప్రజలను పరేషాన్ చేస్తున్నాయి. తంగళ్లపల్లి మండలం పద్మనగర్, అంకుషాపూర్ గ్రామాల మధ్య ఉన్న సంద్రవాగు, వేములవాడ మండలంలోని హన్మాజిపేట గ్రామ శివారులో ఉన్న నక్కవాగు ఈ రెండు వాగులపై వంతెనలు నిర్మించాలని ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రతి వర్షాకాలంలో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాగులు ఉప్పొంగితే అటువైపుగా ఉన్న గ్రామ ప్రజలు ఇటువైపు, ఇటువైపు వారు అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఏళ్లుగా ఈ సమస్య వేధిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం పరిష్కారానికి ప్రయత్నించడం లేదు.



భారీ వర్షానికి పొంగుతున్న నక్కవాగు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్–అంకుషాపూర్ గ్రామాల మధ్యన సంద్రవాగు కాలువపై కల్వర్టు నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని ప్రయాణికులు కోరుతున్నారు.

వరద వస్తే ఎక్కడివారు అక్కడే..

ఓ మోస్తరు వర్షం కురిస్తే చాలు సంద్రవాగు కాలువ ఉప్పొంగుతుంది. దీంతో ఆ దారిలో ప్రయాణించే వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. అంకుషాపూర్‌తోపాటు కొన్ని గ్రామాల ప్రజలు ఈ రోడ్డును ఉపయోగిస్తూ పద్మనగర్ గ్రామం మీదుగా ఇటు సిరిసిల్ల, అటు సిద్దిపేట వైపు ప్రయాణాలు సాగిస్తుంటారు.

చుట్టూ తిరిగిపోవుడే..

తంగళ్లపల్లికి చేరుకోవాలంటే ప్రత్యామ్నాయ మార్గమైన లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ నుంచి రావాల్సి ఉంటుంది. అందుకోసం సుమారు 8 నుంచి 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి అవస్థలు పడాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తే చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో విలువైన సమయం వృథా కావడంతోపాటు ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

వంతెన నిర్మిస్తేనే చింత తీరేది..

సంద్రవాగు కాలువపై వంతెన నిర్మిస్తే తప్ప సమస్య శాశ్వతంగా పరిష్కారం కాదు వంతెన నిర్మాణం చేపడితే అంకుషాపూర్, పద్మనగర్, బద్దెనపల్లి గ్రామస్తులతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో రవాణా కష్టాలు తీరుతాయి.

బ్రిడ్జి నిర్మించాలి



అంకుషాపూర్‌తోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఇదే. ప్రతి వర్షాకాలంలోను రాకపోకలకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. అధికారులు స్పందించాలి. – సామల శ్రీనివాస్ పద్మనగర్

త్వరలోనే నిర్మిస్తాం



కాలువ మూలంగా వర్షాకాలంలో ఇబ్బందులను ఉన్నతాధికారులకు నివేదించాం. మంత్రి కేటీఆర్ చొరవతో నిధులు మంజూరయ్యాయి. అంకుషాపూర్ వరకు బీటీ రోడ్డుతోపాటు కల్వర్టు నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం. – పి.లచ్చాలు ఎంపీడీవో తంగళ్లపల్లి

దూరభారం తగ్గుతుంది



నక్కవాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తే వేములవాడ మండల ప్రజలతో పాటు ఈ ప్రాంతం నుంచి వచ్చే గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గనుంది. వర్షాకాలం కష్టాలు తప్పుతాయి. వెంటనే పనులు ప్రారంభించాలి. – చెన్నాడి శ్యామల, ఎంపీటీసీ, హన్మాజిపేట

నిధులు మంజూరైనా..?

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట గ్రామ శివారులో ఉన్న ఈ నక్కవాగుపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కొన్నేళ్లుగా ఈ ప్రాంతవాసులు ప్రభుత్వాలకు విన్నవించుకుంటున్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు గత ఎన్నికల్లో బ్రిడ్జి నిర్మిస్తామని ఇచ్చి హామీ మేరకు రూ.11.55 కోట్లు మంజూరు చేయించి మూడు నెలలు గడిచినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించ లేదు.

తగ్గనున్న దూరభారం

వేములవాడ నుంచి ప్రధానంగా హన్మాజిపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాల ప్రజలే కాకుండా కోనరావుపేట, నిజామాబాద్ జిల్లా నుంచి వేములవాడకు ప్రజలు వస్తుంటారు. నక్కవాగు ఉప్పొంగితే రాకపోకలు స్తంభించిపోతాయి. బొల్లారం, లింగంపల్లి, హన్మాజిపేట గ్రామాల ప్రజలతో పాటు కోనరావుపేట మండలం మామిడిపల్లి, నిజామాబాద్, చందుర్తి మండలం బండపల్లి, ఎన్గల్, బావుసాయిపేట గ్రామాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల నుంచి వాహనదారులు 15 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఇక్కడ హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తే జిల్లా ప్రజలతో పాటు నిజామాబాద్ జిల్లా ప్రజలకు కూడా 6 కిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది.

ఉపాధ్యాయులకు కష్టాలు

గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, హన్మాజిపేట, బొల్లారం, లింగంపల్లి ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రతిరోజు నక్కవాగు మీదుగా ప్రయాణం చేస్తుంటారు. వర్షాకాలం వచ్చినప్పుడల్లా వీరికి కష్టాలు తప్పడం లేదు. వేములవాడ నుంచి మారుపాక, మంగళ్లపల్లి మీదుగా వారి గ్రామాలకు చేరుకుంటున్నారు.

టెండర్ కాలేదు

హైలెవెల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. కానీ ఇంకా టెండరు పూర్తి కాలేదు. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.
– కాంతయ్య,
అర్‌అండ్‌బీ డీఈ, వేములవాడ

నియామకం

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గోవర్ధన్‌నాయక్

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ తండాకు చెందిన బదావత్ గోవర్ధన్‌నాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు హీరాలాల్ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఎస్టీల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పక్షాన ఉద్యమాలు చేస్తామని, ఎస్టీలకు వ్యతిరేకంగా పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బొంగు తిరుపతి

వీర్నపల్లి: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బంజేరు గ్రామానికి చెందిన బొంగు తిరుపతి యాదవ్‌ను నియమిస్తూ శుక్రవారం యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు నియామక పత్రాన్ని అందజేశారు.

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం

ఇల్లంతకుంట: మండల మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేసినట్లు మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరి రామచంద్రం తెలిపారు. మండల అధ్యక్షుడిగా కుడుముల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా గుండ నర్సింగం, ప్రధానకార్యదర్శి ఎల్లవేని రమేశ్, కార్యదర్శి ఎంద్ర నారాయణను ఎన్నుకున్నారు.

తేలిన బతుకమ్మ తెప్ప



వరద ప్రవాహానికి పైకి తేలిన బతుకమ్మ తెప్ప

వేములవాడ: మూలవాగులో బతుకమ్మ సంబరాలు జరుపుకునేందుకు నిర్మించిన బతుకమ్మ తెప్ప ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూలవాగు ఉప్పొంగి ప్రవహించడంతో బతుకమ్మ తెప్ప పైకి తేలింది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల అరెస్టు

ఇల్లంతకుంట: మండలంలో జరిగిన అభివృద్ధిని చూపించాలంటూ ఇల్లంతకుంట బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు చర్చావేదిక పెట్టేందుకు సిద్ధం కాగా, బీఆర్ఎస్ నాయకులు కూడా చేసిన అభివృద్ధి పనులు చెప్పడానికి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని తమ నాయకులు చర్చకు సిద్ధమయితే ఎందుకు అరెస్టు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఐ సదన్‌కుమార్, ఎస్సై సుధాకర్ కాంగ్రెస్ నాయకులకు సర్దిచెప్పారు. ఇరు పార్టీల నాయకులకు నచ్చజెప్పి అరెస్టు చేసిన వారిని పంపించారు.

'శ్రావణ' సందడి



సిరిసిల్లలో సామూహిక కుంకుమార్చనలు

సిరిసిల్లటౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. సిరిసిల్ల ఆర్య వైశ్యభవనం, బీవైనగర్ కట్టమైసమ్మ ఆలయాల్లో సామూహిక వ్రతాలు, అర్చనలు జరిపారు. వందలాది సంఖ్యలో సుహాసినిలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్యవైశ్య భవనంలో 108 పసుపు కొమ్ములతో అర్చనలు, కట్టమైసమ్మ ఆలయంలో సహస్ర కుంకుమార్చనలు గావించారు.



తంగళ్లపల్లిలో వరలక్ష్మీవ్రతం చేస్తున్న మహిళలు

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నాయకమ్మ దేవాలయంలో మహిళలు మంగళహారతులతో పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, మున్నూరు కాపు సంఘం నాయకులు దుమాల శ్రీకాంత్, కూర సురేశ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వరలక్ష్మీదేవిని అలంకరించి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్తయిదువులకు వాయినం, అమ్మవారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

గంభీరావుపేట: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు గర్భిణులకు సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు పౌష్టికాహారం అందజేశారు. సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు నర్మాల గ్రామంలో సర్పంచ్ రాజు, సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు వినతి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఈటీలు

సిరిసిల్లటౌన్: వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులు ఈ షెడ్యూల్‌లో కల్పించాలని టీజీపీఈటీఏ, టీటీయూ కార్యవర్గసభ్యులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. కోర్టులో రిజర్వు చేయబడిన తీర్పును తొందరగా వెలువడేలా ప్రభుత్వ పక్షాన చొరవ తీసుకోవాలని కోరారు. నాయకులు పాపన్నగారి నాగరాజుగౌడ్, దుప్పటి రవికుమార్, నాంపెల్లి శ్రీనివాస్, పరుశురాం, రాజశేఖర్ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే 20 నుంచి నిరవధిక సమ్మె

సిరిసిల్లటౌన్: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం ప్రతినిధులు వినతిపత్రాలను డీఈవో, కలెక్టరేట్‌లో అందించారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు నాయకులు మీసం లక్ష్మన్, పంతం రవి, నడిగొట్టు లక్ష్మి, నాగరాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం ప్రతినిధులు జి. సంతోష, లత, లక్ష్మి, విజయ, సత్తయ్య మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



పార్టీ కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి: కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలతో పార్టీకి ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో పార్టీలో చేరిన యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విసిగి వేసారిన ప్రజానీకం, నిరుద్యోగ యువత కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని పార్టీవైపు చూస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో జిమ్మికులు చేసి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కకు పెట్టి అక్రమ సంపాదనే ధ్యేయంగా పాలన సాగిస్తుందని ఆరోపించారు. ఎన్నికలు సమీపించగానే ఎన్నడూ రాని కొత్త నాయకులు ప్రజాసేవలు, సర్వేల పేరిట నియోజకవర్గంలో తిరుగుతున్నారని అన్నారు. 20 ఏళ్లుగా గుర్తుకురాని ప్రజలు ఇప్పుడు వారికి ఎందుకు గుర్తుకు వస్తున్నారో ప్రజలు గుర్తించాలన్నారు. ఎళ్లవేళలా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకునే తనకు రానున్న ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇచ్చి ప్రజాసేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తర్రె మనోహర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, నాయకులు పల్లి గంగాధర్, మనోజ్, పార్టీలో చేరిన యువకులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో కృష్ణాష్టమి



కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో శ్రీకృష్ణునికి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ–జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ పూజారి కొండమాచారి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ: మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే రమేశ్‌బాబు కలుసుకుని పూలమొక్క అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల అనుమతులు, దేవాలయ అభివృద్ధి, కలికోట సూరమ్మ చెరువు, ముంపు గ్రామాల సమస్యలు, ప్రధానమైన రోడ్లు, బ్రిడ్జిల అనుమతులపై చర్చించారు.

కేటీఆర్‌ను కలసిన చల్మెడ

వేములవాడ: మంత్రి కేటీఆర్‌ను వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఏఎంసీ పాలకవర్గాలు



ఏఎంసీ చైర్మన్లను అభినందిస్తున్న మంత్రి కేటీఆర్, నాయకులు

సిరిసిల్ల/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట: ప్రాంతంలో ఇటీవల నియామకమైన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్లు మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం ప్రగతిభవన్‌లో కలిశారు. సిరిసిల్ల, పోత్గల్ (ముస్తాబాద్), ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి ఏఎంసీ చైర్మన్లు పూసపల్లి సరస్వతి, అక్కరాజు శ్రీనివాస్, ఎల్సాని మోహన్ కుమార్, హన్మంతరెడ్డి, రాజిరెడ్డి కలువగా వారికి కేటీఆర్ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, తంగళ్లపల్లి ఎంపీపీ మానస, బీఆర్ఎస్ నాయకులు పూర్మాని లింగారెడ్డి, కటుకం శ్రీనివాస్, బందారు శ్యామ్, లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాళోజీ జయంతి

ముస్తాబాద్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ జయంతి ముందస్తు వేడుకలను మండలంలోని బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తన రచనలతో తెలంగాణ యాస భాషలను నలుదిశలా వ్యాపింపచేసిన కాళోజీ బాటలో పయనించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చారి, తెలుగు టీచర్ బిందుమాధవి, సత్యనారాయణ, ఎల్లారెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని చీకోడు, మోహినికుంట గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, సర్పంచ్ కల్వకుంట్ల వనజ, ఎంపీటీసీ సవిత, ఉపసర్పంచ్‌లు నాగరాజు, సంధ్య, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన షేక్ రషీద్‌కు రూ.16 వేలు, కూస దేవయ్యకు రూ.31 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ అందజేశారు.

పుస్తెమట్టెలు అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన నిరుపేద కుటుంబం వెంగల రూప–శ్రీనివాస్ దంపతుల కూతురు రేఖ వివాహం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్టు ద్వారా శుక్రవారం పుస్తెమట్టెలు, గాజులు, పట్టుచీర అందజేశారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

గంభీరావుపేట: ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాలు కోల్పోయిన తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని స్థానిక బరిగెలగూడెం కాలనీవాసులు సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులుకు శుక్రవారం వినతిపత్రం అందించారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

ఎల్లారెడ్డిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శ్రమదానం చేశారు. తరగతి గదుల చుట్టూ పేరుకుపోయిన చెత్తతో పాటు పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రోగ్రాం అధికారి పర్శరాములు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలను పట్టించుకోవాలి

గంభీరావుపేట: మండలం భీమునిమల్లారెడ్డిపేటలో రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, జిల్లా నాయకులు కొక్కు దేవేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గ్రామశివారులో మానేరు వాగు అవతల పొలాల్లో చిక్కుకుపోయిన రైతులను అధికారయంత్రాంగం వెంటనే గ్రామానికి తీసుకువచ్చేందుకు లేదా ఆహార సామాగ్రి అందించే ప్రయత్నాలు చేయాలని కోరారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు సత్యం, రాజం, ఆంజనేయులు ఉన్నారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం

ముస్తాబాద్: సంగారెడ్డిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడులు చేసిన ఏబీవీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో ఏబీవీపీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయిచరణ్, ఆదిత్య, రాజేంద్రప్రసాద్, భాను, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి సంఘం సభ్యులు

ఇల్లంతకుంట: మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను వల్లంపట్ల రెడ్డి సంఘం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. రెడ్డి సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ వెంకటనర్సింహరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, రాజిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రతాపరెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

వేములవాడరూరల్: షేర్‌లింగంపల్లిలోని వట్టినాగులపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగలో దళితులు పాల్గొనవద్దని అడ్డుకుని దళితులపై అగ్రవర్ణాలు దాడిని వేములవాడరూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఖండించారు. నాయకులు ఆవునూరి హరీశ్, సుంకపాక హరీశ్, ప్రశాంత్, షేబాక్, హిమనెల్, శాంసన్ పాల్గొన్నారు.

సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవు

ఇల్లంతకుంట: సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసినా, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా వ్యక్తిగత విమర్శలు చేసినా గ్రూప్ అడ్మిన్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా గ్రూపుల్లో పోస్టులు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి పెట్టాలని, దీంతో పాటు గ్రూప్ అడ్మిన్లు గ్రూప్‌లపై పూర్తి నియంత్రణ కలిగి ఉండాలని సూచించారు.

సీఈఐఆర్ పోర్టల్‌పై అవగాహన

వేములవాడరూరల్: మండల పరిధిలో పోగొట్టుకున్న నూకలమర్రికి చెందిన వంశీ, ఫాజుల్‌నగర్‌కు చెందిన వేణు, కోరుట్లకు చెందిన పరమేశ్వరీ మొబైల్ ఫోన్‌లను వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి శుక్రవారం బాధితులకు అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్‌లో నమోదు చేసుకుని నేరుగా ఫోన్‌ను బ్లాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రుద్రంగి: స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.